# 12. రాగద్వేషాలు

సంధ్యవేళ తలొంచుకొని వాకిలి ఊడుస్తున్నాను. వీధిలోకి వొచ్చేముందు అంతా నిర్మానుష్యంగానే వుంది. రెండు మూడు మొగ కంఠాలు ఆ దగ్గర్లోనే వినిపించినవి. కాని వారెవరో చూద్దామనే కుతూహలం కూడా నాకు కలగలేదు.

"ఎవర్రా?" ఒక గొంతు ఏదో రహస్యాన్ని వూదింది. బహుశా నాకు వినిపించాలనే స్థాయి పెరిగిందనుకుంటాను.

"ఇదా?...హఁ....హఁ....హఁ... రంభ, ఊర్వశి, తిలోత్తమ, మేనక...వీళ్ళల్లో ఎవరైనా కావొచ్చు. ఎక్కడో బాగా చూసిన జ్ఞాపకం – కలలోనేమోననుకుంటాను––" పెద్దగా హేళనగా, గంభీరంగా ఖంగుమనే కంఠంలోని మాటలివి.

యీ సారి నాకు వొళ్ళు మండింది ఇంతవరకూ నేను తలెత్తకపోయినా యీ మాటలు నన్ను గూర్చేనని నాకు బాగా తెలుసు. వాళ్ళు మాట్లాడేది ఒక స్త్రీని గూర్చి. మరే స్త్రీ ఆ వీధిలో లేకుండటం వల్ల ఆ మాటలు ఎవర్ని గూర్చి అనే సందేహం నాకు లేదు. యీ పోకిరీ వెధవలెవరా అనే కుతూహలం కూడా కలిగింది. తలెత్తి చూశాను.... ముగ్గురు ఎదురింటి అరుగు మీద సిగరెట్లు తాగుతూ నిలబడి వున్నారు.

"అదుగోరా – నీ స్వప్నసుందరి!" ఇది మూడో గొంతు!

అభిమానంతో శరీరం వొణికిపోయింది. ఎవరనుకుంటున్నారో? వెధవలు! చేతిలోని చీపురుకట్ట తిరగేద్దామనుకున్నాను. అంత దూరం రాకుండానే గుడ్లెర్రజేసి పళ్ళతో కింద పెదవి కొరికి, నా అభిప్రాయాన్ని వాళ్ళకు వ్యక్తపరిచాను. అందులో ఇద్దరికి గుండెలు జారిపోయిన సూచనలు స్పష్టంగా కనిపించినయ్. మూడోవాడు మాత్రం "కోపం వొచ్చినా చెడని అందం అంటే చూడండిరా!" అంటున్నాడు.

యీ మొండివాళ్ళతో ఇప్పుడే తలపడి బజారుపాలయేందుకు ఇష్టం లేక తుపుక్కున రోడ్డుమీద ఉమ్మేసి పెద్ద చప్పుడుతో వీధి తలుపులు వేసుకున్నాను. బైటినుంచి మూడు గొంతులూ కలిపిన వికటాట్టహాసానికి ప్రవేశం లేకపోలేదు.

ఏమైనా ఆ దృశ్యాన్ని గూర్చి ఆలోచించకూడదనుకున్నాను; ఎందుకంటే అందువల్ల నాకు బాధే కలుగుతుంది కనుక! కాని ఇలాటిది సాధ్యపడదనే విషయం తెలుసుకునేందుకు ఎక్కువసేపు పట్టలేదు.

అవే ఆలోచనలు– వాళ్ళన్న ప్రతీ అక్షరమూ నాకు గుర్తుంది. వీళ్ళ ఉద్దేశ్యమేమిటి? వాళ్ళెవరో కూడా నాకు తెలియదు: ఈ ఇంట్లో ఇప్పటికి ఒక్క నిద్రే కావటం వల్ల ఆ వీధిలోని ఏ వొక్క మొహమూ నాకు పరిచయం లేదు. నాలాటి సంసారిని పట్టుకొని 'అది' అన్నారంటే– బహుశా అదివాళ్ళ గుండె ధైర్యమై వుండదు. ఏదో తమాషాకు నన్ను ఏడిపించేందుకన్నట్టు ఒంటరిగా చూసి అని వుంటారు. ఐతే మాత్రమేం– శీలవతి, అభిమానవతి బాధపడనే పడుతుంది...ఒకవేళ పొరపడుతున్నానేమో? నేను బాధపడటం వల్ల అలా వాళ్ళకు కనిపించటం వల్ల మరింత అలుసవను కదా? అందుకని శరీరంలోని రక్తమాంసాల్ని ఎలా తోసెయ్యగలను?

ఐనా వాళ్ళు చూడబోతే – బాగా చదువుకున్నవాళ్ళల్లే వున్నారు కదా – ఇలా మాట్లాడటమే మర్యాదనుకున్నారా? నాగరికత ఏ స్థాయిలోకి దేకుతుందో తలుచుకుంటేనే వొళ్లు గగుర్పొడుస్తోంది. వాళ్ళకు శాస్తిగా ఉమ్మేసినా, అదేదో నేను చిరునవ్వు నవ్వినట్టుగానే తీసుకున్నారంటే – పరమానందయ్య శిష్యులకు నేటి ప్రపంచంలో కూడా స్థానం లేదని అర్థమవక పోదు. మూఢుల్ని గూర్చి ఆలోచించటం మరింత మౌఢ్యమే ఐనా వారివల్ల హానికలగకుండా చూచుకోవాల్సిన బాధ్యత నాలాటి సంసారికి లేకపోలేదు.

ఐతే ఆ హాని ఏమిటనే విషయం ఇప్పుడు తేలదు. నిజానికి అది ఎదురయాక కాని ఇదమిత్థంగా తెలియదు. దాని విరుగుడు కూడా అప్పుడే ఆలోచించుకోవాల్సి వుంటుంది. వాళ్ళు ఇంతటితో వొదిలిపోతారనే నమ్మకం కూడా లేకపోలేదు.

యీ రకమైన ఆలోచనల్లో అన్యమనస్కంగా వున్నాను. వొదిన రెండు మూడు సార్లు నా యధాలాపాన్ని గమనించింది. ఇక ఆయన – ఏ అర్ధరాత్రి వొచ్చి పడుకున్నారో...ఇలాటివన్నీ ఆయనకు – పట్టినయ్యా! ఆ ఆఫీసుపనేమో తనేమో– నన్నొకదాన్ని పోషిస్తూన్నా, బతికే వున్నదనే దృష్టన్నా లేకుండా జీతం పుచ్చుకుంటున్నాను కదా అనే కృతజ్ఞతతో ఆ ఆఫీసర్‌గారి సేవ మినహాగా ఆయనకు లోకంలో మరేమీ లేదన్నట్టే ప్రవర్తిస్తారు. ఇలాటి ప్రవర్తన వల్ల లోగడ నా కెప్పుడూ కష్టంకలగలేదు కాని, గత సాయింత్రపు సంఘటనవల్ల నా జీవితంలో ఒక పెద్ద లోపం – నాకు తెలియకుండానే ఇన్నాళ్ళూ పెద్దదై యీనాడు ఇంకా పెద్దదిగా తయారైందని తోచింది.

ఒక సమస్యగా బయలుదేరి ఎన్ని ఇతర సమస్యల్ని తోడుతెచ్చుకోవటమౌతుందో తలుచుకుంటే ఆశ్చర్యమే ఐంది.

## 2

రాత్రి చాలాసేపటివరకూ మేలుకొని ఉండటంవల్ల ఉదయాన్నే బద్ధకంగా నిద్రమంచంలోనే ఉండిపొయ్యాను. సూర్యుడి లేతకిరణాలు కిటికీలోనుంచి వొచ్చి మీదపడుతూన్నా లేవబుద్ధి కాలేదు. నిద్ర మెలుకూ రాగానే గత సాయింత్రపు దృశ్యమే కళ్ళముందు నాట్యం చేయసాగింది.

"ఏం మెలుకూరాలా?" అంది వొదిన సావిట్లోంచి వంటింట్లోకి వెళ్తూ.

ఆయన అప్పుడే బైటికి వెళ్ళిపొయ్యాడు. మిగిలిందల్లా మేమిద్దరమే!

వొళ్ళు విరుచుకొని లేచి వాకిట్లోకి వెళ్ళాను.

నిన్న నన్ను కవ్వించినతను తీరిగ్గా మొహం కడుక్కుంటున్నాడు. నన్ను చూడగానే నవ్వాడు. క్షణంలో మోహంలో అతనంటే నాకెంత ద్వేషభావముందో నిరూపించేందుకు కనుబొమలు చిట్లించి ఉరిమి చూశాను. తుపుక్కున ఉమ్మేశాడు- నిన్న సాయింత్రం ఏ పనితో నేను వీళ్ళపట్ల నా అభిప్రాయాన్ని సూచించానో అదేపనితో నన్ను అపహాస్యం చేసినట్టయింది. నా కేమీ తోచలేదు- ఇంట్లోకి వెళ్ళిపొయ్యాను.

పనిపాటలు చేసుకున్నంతసేపూ ఆ ఎదురింటి కుర్రాణ్ని గూర్చిన ఆలోచనలే బుర్రలో మెదులుతున్నయ్. నేనంటే వీడికింత ద్వేషమెందుకు? నన్నీవిధంగా వెంటాడి అవమానించటంలో వీడి ఉద్దేశ్యమేమిటి? తమాషా ఏమిటంటే నా జీవితంలో నా అందచందాలకు మూర్ఛపోయి వెంటాడిన యువకులు డజనుకు ఏ విధంగానూ తక్కువ లేరు. వాళ్ళందర్నీ ఎంతో ఏడిపించి పరస్త్రీని, కులీనను ఎంత మర్యాదగా చూడవలసిన బాధ్యత వారికివుందో, మర్యాదగానే అర్థమయ్యేట్టు చేసి మరీ పంపగలిగాను. నా సౌశీల్యత మీద నా కెప్పుడూ అనుమానం వేయలేదు. కాని యీ సమస్య వేరొక రూపాన తయారైంది. ఇతరులవలెనే వీడు నా వెంట పడ్డట్టయితే ఆ ధోరణి, ఏ విధంగా వీడికి బుద్ధొచ్చేట్టు చేయాలో ఆ విధానం పూర్తిగా తెలియడమే గాక, గాలిపీల్చినంత తేలిగ్గా యీ సమస్యను భేదించగలిగేదాన్ని. కాని నన్ను ద్వేషించే వ్యక్తి విషయంలో ఏం చేయాలో తోచలేదు.

వీధిలోకి వెళ్ళటమంటేనే ఒక పెద్ద భయం ఏర్పడింది. వాడేదో అంటాడు. నేను భరించి ఊరుకోవాలి. లేక ఎదురుతిరుగుతే - నన్ను సిగ్గువిడిచినదానిలాగ బజారు స్త్రీ వలె యీ జనమంతా భావిస్తారు. సంసార జీవనానికి ఒక పెద్ద మచ్చ ఏర్పడుతుంది. లేదా గౌరవాన్ని మానమర్యాదల్ని త్యాగం చేయాలి- అది ఎన్నటికీ కుదరదు. సాంఘిక జీవనంలోని నియమాల్ని అతిక్రమించే సాహసం నాకు లేదు.

ఐతే వాడి స్వాతంత్ర్యాన్ని అంగీకరించినట్లు భరించి మౌనంగా వూరుకోవటం అంతకన్నా కష్టమే అనిపించింది. యీ త్రిశంకుస్వర్గం మరీ బాధాకరమైంది.

సాయంత్రానికల్లా వొదిన వీధి వీధంతా తిరిగి వొచ్చింది. ఆమె కలుపుగోలుతనం నాకు తెలియంది కాదు. ఇరుగమ్మ గూర్చీ, పొరుగమ్మ గూర్చీ నేను అడగకుండానే చెప్పనారంభించింది. ఎదురింటిని గూర్చి అడుగుదామని నాలిక చివరి వరకూ వొచ్చింది కాని, ఆమెను చెప్పకుండా ఆపగలగటం మరీ కష్టం గనుక, ఓర్పుతో వేచివున్నాను. అనుకున్నట్టు ఆమే మొదలుపెట్టింది.

"అన్నట్టు ఎదురింట్లో పంపువుందే! యీ బావి నీళ్ళు బొత్తిగా బాగుండలేదు. ఎలాగైనా వాళ్ళతో స్నేహంచేసుకుంటే పంపు నీళ్ళు తెచ్చుకోవచ్చు."

ఏడ్చినట్టుంది, ఎదురింట్లో పంపు ఉండటం వల్ల యీ బావినీళ్ళు బాగా లేవు; లేకపోతే ఇవి బాగానే ఉంటయ్. నాలుగుపూట్లా యీ నీళ్ళను గూర్చి కనపడని చెడు ఇప్పుడు కనిపించటంలో ఆశ్చర్యం లేదేమో?

"వాళ్ల ఆడవాళ్ళు ఊళ్ళో లేరట. కాన్పుకు వెళ్ళారట. ఐనా వెళ్ళి అడిగితే నీళ్ళు పట్టుకోనీడా?"

"అడగరాదూ?"

"ఏం భయమా?" అందామె.

అన్నట్టే సాయింత్రం ఆమె వాళ్ళింట్లోంచి పంపునీళ్ళు తేనే తెచ్చింది. దొరికినవి కనుక, నూతినీళ్ళకన్న పంపునీళ్ళు బాగానే వున్నయ్. కాని ఆమెకు లేని భయమేదో నాకు ఉండనే వుంది. ఆ ఇంటిపేరు తలుచుకుంటేనే వికారం కలుగుతోంది.

మర్నాడు ఉదయాన పంపునీళ్ళు తెచ్చేపని వొదిన నాకు పురమాయించింది.

"నువ్వే పోయిరా" అన్నాను.

"ఏం... నువ్వెళ్ళు. అవతల పొయ్యి మండిపోతోంది. ఆ అబ్బాయి చాలా మంచివాడు. అడగ్గానే తీసుకెళ్ళమన్నాడు" అంది వొదిన.

యీ సమయంలో తగిన కారణం చూపితేనే కాని యీ పని నుంచి తప్పించుకోలేను. ఆ సోదంతా వొదినకు చెప్పటం వల్ల మరింత అపహాస్యం కావటంతప్ప జరిగేదేమీ లేదు. కనుక కిమ్మనకుండా బిందె పట్టుకొని బయలుదేరాను.

ఒక విధమైన నరాల బలహీనత్వం నన్ను వెంటాడుతోంది. కాని ఇంకో విధంగా ఆలోచిస్తే ఇదీ ఒక మంచికే వొచ్చిందనిపించింది. ఎందుకనంటే ఇంతా ఏడుస్తే నా తలలోని యీ వూహలన్నీ కేవలం నా తలలోవేనేమో! ఆ సంగతి అటో ఇటో తేలిపోవటంవల్ల యీ గడ్డుసమస్య దానంతటది కరిగిపోతుంది. అంతేకాదు; నా

యీ వెళ్ళటం వల్ల వృథాగా అతను నా మీద కనబరచిన నీచాభిప్రాయాన్ని మార్చుకోవటం వల్ల - మా ఇరుగు పొరుగులకు సఖ్యతన్నా కుదురుతుంది.

దొడ్డి తలుపు వేసి వుంది. ఏమని పిలిచేట్టూ? తలుపు కొడదామనుకున్నాను. బలంగానే రెండు దెబ్బలు తలుపుమీద వేసేప్పటికి చప్పున తెరుచుకుంది; లోపల గడియ లేనందువల్ల, కాస్తయితే ముందుకు పడేదాన్ని. ఎలాగో సంబాళించుకొని ముందుకు సాగాను.

దొడ్లో ఎవరూ కనిపించలేదు. ఏ క్షణాన ఎవరొస్తారోనని దొంగకులాగు భయంవేసింది. ఏమైనా నేను ఎదుర్కోగలననుకొన్న సంఘటన ఎదురవక పూర్వమే ఇక్కడనుంచి తప్పుకుపోతే సరిపోతుందనిపించింది. కనుక మాట్లాడకుండా పంపుదగ్గర బిందె నింపుకోసాగాను.

సగం నిండిందో లేదో ఆయన ఇంట్లోంచి వొచ్చాడు. ఇంతకు పూర్వం ఆయన్ను పరీక్షగా చూడలేదు. యువకుడు. స్ఫురద్రూపి కూడా! మొహంలో ఎంతో ఉత్సాహం, యీ లోకంలో సౌఖ్యం వుందనే సత్యం వుట్టిపడుతూనే వుంది. ఐనప్పటికీ మొన్న సాయిత్రం నన్ను అవమానించాడనే సంగతి మొట్టమొదట్లో గుర్తుకు రాలేదు. ఇప్పుడా వూహ కలగటంతోనే మనసులో కొంత యీర్ష్య ఏర్పడింది.

"ఎవరూ?" అన్నాడు అధికార స్వరంతో.

నాకు కోపం వచ్చింది. ఆయనెవరో నాకు తెలియకపూర్వమే నేనెవరో ఆయనకు తెలిసివున్నట్టు మాట్లాడిన సంగతి అప్పుడే ఎలా మరిచిపోగలిగాడు? ఇదంతా వొత్తి నటనని తేలిపోతూనే వుంది. ఐనప్పటికీ నేనెవర్నో చెప్పుకోవాల్సిన పరిస్థితి కావటం వల్ల నా కోపాన్ని ఏ విధంగానూ వెడలగ్రక్కలేకపొయ్యాను.

"నీళ్ళు పట్టుకునేందుకు..." అని నీళ్ళు నమిలాను.

"అదే ... ఎవరంట?"

"ఎదురింటి...."

"ఓహో! మీరా?...తలుపు గడియ లేకపోతే ఎవరో వొకరు స్వతంత్రంగా దూరుతూనే వుంటారు!"

నేనేదో పెద్ద దొంగతనానికి వొచ్చినట్టు మాట్లాడుతున్నాడేమో అని ఆయన మొహంలోకి చూశాను. కాని ఆయన నవ్వును బట్టి ఎగతాళిగానే మాట్లాడాడని అర్థమైంది.

మరేమీ మాట్లాడకుండానే ఆయన ఇంట్లోకి మాయమయ్యాడు. ఇప్పుడు యీ ఒంటరి పోరాటంలో ఇంత గౌరవంగా మాట్లాడి ఇతరుల దగ్గర నన్ను వృథాగా ఎందుకు అగౌరవపరిచాడో అర్థమవలేదు.

బిందె తీసుకొని వొస్తుండగా దొడ్డి వాకిలి దగ్గర మడతలు వేసిన కాగితాన్ని నా దారికి అడ్డంగా నేను చూస్తుండగానే విసిరివేశాడు. వాకిలి తీసే ఉండటం వల్ల రోడ్డుమీద నడిచేవాళ్ళెవరికంటైనా పడినా పడొచ్చు! ఎంత ధైర్యం! నేను అనుకున్నట్టు ఇతను గౌరవం తెలిసిన వ్యక్తే కాదు. అందులోనూ ఇలాటి సంఘటనలో ఒక్కక్షణంలోనే ఏదోవొకటి తేల్చుకోవాలి. ఇది తీసుకోవటమా – మానటమా?

తీసుకోవటం వల్ల – లిఖితపూర్వకమైన సాక్ష్యం నా చేతుల్లో వుంటుంది. ఎప్పుడు కావాలంటే అప్పుడు వీడికి తగిన శాస్తి చేయగలుగుతాను. నేను తీసుకోవటంవల్ల వీడికి ఎలాటి దురభిప్రాయం ఏర్పడినా తరువాత నా తెలివితేటల్ని ప్రదర్శించినప్పుడు పశ్చాత్తాపపడకపోడు. ఇకముందు నాలాటి ఇల్లాళ్ళ జోలికి పోడుకూడాను.

యీ ఉద్దేశ్యంతోనే వొంగి కాగితాన్ని తీసుకొని చప్పున బైట పడ్డాను. బిందె దింపి ఏం రాశాడోనని చూసేందుకు గదిలోకి వెళ్ళాను. వొణికే చేతుల్తో మడతలు విప్పాను.

ఒక్క క్షణం తలకిందులయానంటే ఎవరూ నమ్మరనుకుంటాను. కాని అది వొఠ్ఠి తెల్లకాగితం కావటం వల్ల నా మొహం దాని రంగును పోటీ చేస్తూనే వుండి వుండాలి!

యీ వ్యక్తిని గూర్చి నేను ఆవగింజలో అరభాగమైనా ఇంతవరకూ తెలుసుకోలేకపొయ్యానని తేలిపోయింది. వొఠ్ఠి చిలిపి చేష్టలు చేయటమే అతని గుర్రై వుండాలి. నా కోపమంతా పోయి నవ్వుకున్నాను. కాని అతనికి ఆ చిలిపి చేష్టలే ఆనందాన్నిస్తే ఇవ్వొచ్చుకాని పిల్లికి చెలగాటం ఎలక్కు ప్రాణసంకటం వలె నన్నా చేష్టలు ఎంత కలతపెట్టి బాధిస్తున్నవో చదువుకున్న వాడు, ఆ మాత్రం ఆలోచించనక్కర్లా? ప్రస్తుతం నేనున్న నిస్సహాయ స్థితి నన్ను మరింతగా వేధించసాగింది.

అతనంటే లోగడ కలిగిన అసహ్యం రెట్టించింది. ఏ విధంగానన్నా అతనికి హాని చేసే అవకాశమే నాకు వుంటేనా! ఎప్పుడూ ఇవే ఆలోచనలు కావడం వల్ల ఒకరకమైన బాధతో పనిపాటల్లో అన్యమనస్కంగా ఉండటం జరిగింది. యీ మార్పును వొదిన కనిపెట్టిందనుకుంటాను.

"పంపునీళ్ళు పడటంలేదా?" అంది.

"పడకేం––"

సందర్భం లేకుండానే వొదిన అతన్ని గూర్చి చెప్పసాగింది, నేను ద్వేషించే వ్యక్తి ఐనప్పటికీ ఒక రకమైన అయిష్టంతోనే అంతా వినసాగాను.

"చాలా మంచి వాడు. సుందర్రావుకు ఎంత కలుపుగోలుతనం వుందనీ! వీధిలో అందరికీ యిష్టుడు. బాగా చదువుకున్నాడు. మనిషి కూడా బాగుంటాడు కదూ?"

నేనేమీ జవాబు చెప్పలేదు. ఆమె ఏ ఉద్దేశ్యంతో యీ మాటలు అంటూవుందో నాకు అంతుపట్టలేదు. ఆమె సుందర్రావును తిట్టినట్టయితే నాకు ఎంతో తృప్తి కలిగేది; నేనూ కంఠం కలిపేదాన్ని.

ఒకసారి కాదు! ఒక సమయంలో కాదు! ఆమె సుందర్రావును గూర్చి అనేకసార్లుగా అయాచితంగానే వాగుతూండటం వల్ల ఆమె గురి ఏమిటో అర్థం కాలేదు. కాని ఒక పెద్ద అనుమానం కలిగింది. నన్ను వెంటాడినట్టే సుందర్రావు యీమెను కూడా వెంటాడి వుంటాడు. వాడి నైజమే అంతేమో. నేను ఎదురుతిరిగాను: కాని వొదిన లొంగిపోయి వుండాలి; లేనిపక్షంలో అతన్ని గూర్చి మాట్లాడాల్సిన అవసరం లేదు. అందులోనూ కీర్తించవలసిన అవసరం అంతకుమునుపే లేదు. యీ మధ్య నన్ను వెంటాడటం తగ్గించటం వల్ల సుందర్రావు గురి వొదిన వైపు తిరిగి వుండాలనే అనుమానం మరింతగా దృఢపడింది.

యీ అనుమానం నాలో కొత్త భావాల్ని రేకెత్తించింది. యీమె ఏమంత అందమైనదని వెంటాడుతున్నాడు? విధవగా యీ కొంపలో చాకిరీ చేసుకొని పొట్టపోషించుకునే యీమెకోసమై ప్రయత్నించటం నిజంగా హాస్యాస్పదంగానే వుంది. నా దగ్గర వాగినట్టే యీమె వీధిలో ఆడవాళ్ళందరి దగ్గరా అంతకన్నా తక్కువేమీ వాగివుండనట్టయితే యీ వ్యవహారం వీధిపాలయేందుకు ఎక్కువ కాలం పట్టదు.

రోజుల తరబడిగా వొదిన నా చెవుల్లో గూడుకట్టుకొని సుందర్రావును కీర్తిస్తూండటం వల్ల పూర్వపు నా అభిప్రాయానికి కొంత దెబ్బ తగిలిందనే అనుమానం లేకపోలేదు. అదీగాక మొదటి రెండు మూడు రోజుల్లోనూ సుందర్రావు వొంటికాలి మీద నా మీదికి లేచేవాడు. తరువాత నన్నసలు లెక్కచేయనట్లే కనిపిస్తోంది. ఒకవిధంగా యీ సమస్య తీరింది కదానని అప్పుడు సంతోషించాను.

కాని ఇప్పుడు ఆలోచిస్తే - ఆ లెక్కచేయకపోవటమనేది యీ వొదిన వల్లనే. తన దృష్టిని యీమెమీద కేంద్రీకరించటం వల్ల నన్ను సరిగా చూడనన్నా చూడటంలేదు. దీనికంతకూ కారణం యీ వొదినే! ఇది వరకు సుందర్రావు మీద వుండే జుగుప్స వొదిన మీదకు మళ్ళింది.

సదుద్దేశంతోనో, దురుద్దేశంతోనో, సుందర్రావు నాకు కొంత విలువను పూర్వం ఇచ్చాడు. 'స్వప్న సుందరి' అని మొదటినాటి సాయిత్రం అన్న మాటల్ని నా జీవితంలో మరచిపోలేను. కాని ఇప్పుడు స్థాణువువలె అతను ఊరుకున్నా నా కింతకష్టం కలిగేది కాదు. నా తోటిది నాకన్న అన్నివిధాల తక్కువదైన వొదిన మీదకు ఆ మంచి అభిప్రాయం (!) పారటం నా కెంతో కష్టమే అనిపించింది.

యీ వ్యవహారం ఎక్కువ రోజులు సాగనీకుండా చూడాల్సిన నా బాధ్యత కూడా గుర్తుకొచ్చింది. ఇది కేవలం బాధ్యత కాకపోయినా ఏదో అందని పండును వొదిన

లాక్కుపోతోందనే ద్వేషభావమే ఇందుకు - కారణమనుకుంటాను. ఐనా విధవరాలికి ఈ వేషాలెందుకు? ఇల్లాలు వున్న భర్తే సుందర్రావుకు ఇలాటి నీచాభిప్రాయాలేమిటి?

ఎటూ తోచని స్థితికి గురయ్యాను. ఏం చేద్దామన్నా తోచటంలేదు. భోంచెయ్యగానే వీధిలోకి పెత్తనాలకు వెళ్ళింది వొదిన. ఒక్కతెనూ ఇంటి వాసాల్ని లెక్కించే మామూలు పనితోనే గడపాలి నేను.

ఎవరో కుర్రాడు వచ్చాడు- దగ్గరేసి వున్న తలుపు నెట్టుకొని. నేను అదిరిపడి లేచి కూర్చునేప్పటికల్లా నా ముందుకు వొచ్చి "మీకు ఇచ్చి రమ్మన్నారు." అని పాతపత్రికల్ని ఇచ్చి పరుగెత్తుకెళ్ళాడు.

ఎవరా అనే అనుమానం వొచ్చింది కాని ఎవరై వుంటారో వూహించుకొని నా వూహ ఎంతవరకూ సరైందో తెలుసుకునేందుకు దొంగ చాటుగా గది కిటికీ సందులోంచి చూశాను. ఎదురు వాకిట్లో సుందర్రావు నిలబడి వుండటంతో నా వూహ దృఢమైంది.

యీ పత్రికలు బహుశా వొదిన కోసమై వుంటవి. వీరి స్నేహం అంతవరకూ వెళ్ళటంలో ఆశ్చర్యపడాల్సిందేమీ కనిపించలేదు. నాకు వొళ్ళు మండిపోతోంది. కాని ఏం చేయను?

పత్రిక విప్పాను; ఒక కాగితం కిందపడింది. చూద్దునుకదా "రాత్రి వొంటిగంటకు- ఇంట్లోకి రా" అని వుంది.

ఎవరికో తెలియదు- ఎవరికేమిటి - వొదినకే! యీ వుత్తరాన్ని వెంటనే దాచేశాను. ఇలాటివి ఇంకేమన్నా ఉన్నవేమోనని పాతపత్రికల దుమ్ము దులిపాను. ఎందుకుంటవీ? ఐతేనేం - యీ బ్రహ్మాస్త్రం వొక్కటే చాలు వీళ్ళిద్దరి ముక్కులకూ తాళ్ళు బిగించేందుకు.

యీ వుత్తరం మీద కనీసం నా పేరు వుంటే, నేనావిధంగా అర్థంచేసుకునే అవకాశమన్నా వుంటే ఇంత వేదనపడేదాన్ని కాదు. లేనిపోని యీర్ష్యకు గురవుతున్నానని తెలియకుండానే నాలోని భావాలు అందుకు అనుగుణంగా పనిచేయనారంభించినయ్.

ఎంతో ఆలోచన మీద ఒక నిశ్చయానికి వొచ్చాను. యీ వుత్తరం ఏ పరిస్థితుల్లోనూ వొదిన కంట పడనివ్వను. అంటే వొదిన యీ రాత్రి అక్కడికి వెళ్ళేందుకు సిద్ధమవదు. ఆమె స్థానంలో నేనే వెళ్ళి సుందర్రావును కడిగేసి బుద్ధివొచ్చేట్టు చేయాలి. ఇంకెప్పుడూ కులాంగనల పట్ల ఇలా ప్రవర్తించ వొద్దనీ, అలా జరిగినట్టయితే యీ ఉత్తరాన్ని నలుగురిలోనూ పెట్టి గోల చేస్తాననీ బెదిరిస్తే...ఎంత మొగాడైనా నా కాళ్ళమీద పడకమానడు! ఆయన యీ సమయంలోనే క్యాంపుకు వెళ్ళి వుండటం కూడా మంచికే వొచ్చింది కనుక యీ సదవకాశాన్ని దుర్వినియోగం చేయకూడదని దృఢనిశ్చయనయాను.

## 3

అర్ధరాత్రి కళ్లు మూసుకొని నిద్ర నటిస్తూన్నానే కాని బుర్రలో జరగబొయ్యే దృశ్యాన్ని రకరకాలుగా చిత్రించుకుంటూ ఆనందిస్తూనే వున్నాను. వొదిన అమాయకంగా గురకపెడుతూ నిద్రిస్తోంది.

మెల్లిగా లేచి చప్పుడు కాకుండానే వీధి తలుపులు తెరిచాను. వీధిలో చూస్తే వెన్నెల్లో నీడలు తప్ప మరేమీ లేవు. చల్లని గాలి ధారాళంగా వీస్తోంది. యీ వాతావరణంలోనే సుందర్రావు పని పట్టాలి.

సాయంత్రమే చక్కగా అలంకరించుకున్నాను. బహుశా నన్ను చూడగానే తన కోసమే వొచ్చాననుకుంటాడు. దగ్గరకు రాగానే చెంప ఛెళ్ళుమనేప్పటికి దిమ్మతిరిగిపోతుంది! ఐతే యీ అలంకరణ అనవసరమని తెలిసినా వాడిలో వింతభావాలు రేకెత్తింపజేసి ఒక శిఖరాగ్రం నుంచి పడతన్నాలనే ఆలోచన మీదనే ఇలా తయారయ్యాను.

పడుకున్నప్పుడు రేగిన తలను గోళ్ళతో సవరించుకున్నాను. వీధిలో నడవాల్సిన పది అడుగులూ నన్ను గాబరాపెట్టినవి. ఎవ్వరూ చూడరనే నమ్మకం వున్నా చూస్తే ఏమౌతుందనే భయం లేకపోలేదు. అందులోనూ అలవాటున్న వొదినలాగు కాకుండా బొత్తిగా కొత్త మేళాం కావటం చాలా ఇబ్బంది ఐంది.

తెగించి వెళ్ళి అరుగు మీద పడ్డాను. అంతవరకూ బిగపట్టిన వూపిరి వొదిలి చల్లగాలి పీల్చుకొని సడలిన ధైర్యాన్ని పుంజుకున్నాను. సురక్షితంగా ఇక్కడికి రాగలిగాక యీ సంఘటన అనుకున్నంత ప్రమాదకరంగా లేదని తేలిపోయింది.

మెల్లిగా తలుపు నెట్టాను. దగ్గరేసి ఉండటం వల్ల సన్నగా చప్పుడు చేసుకుంటూ తలుపు తెరుచుకుంది. చిన్న బల్బ్ పలచని కాంతిని హాలులో వెదజల్లుతోంది. ఒక్క అడుగు లోపలికి వేశానో లేదో స్విచ్‌పడి దేదీప్యమానమైన కాంతితో హాలంతా నిండిపోయింది. ఎంతో భయం వేసింది. కాని నవ్వుతూ సుందర్రావు ఎదురొస్తున్నాడు.

కావాల్సింది అదే ...రానిమ్మనుకున్నాను. కాని అల్లంత దూరానే ఆగి "మీరా? రండి...రాణీ గారూ" అని ఆహ్వానించాడు.

గొంతులో వెలక్కాయ పడ్డట్టయింది. కొత్తగా సిగ్గుదొంతరలు మీద పడుతున్నయ్. పమిటకొంగు వేలికి చుట్టుకుంటూ అలాగే నిలబడి పొయ్యాను.

"దయచెయ్యండి."

ఇక మాట్లాడక తప్పలేదు. అన్నాను: "నేను మీరనుకున్నంత హీనురాలను కాదు...తెలిసిందా?"

"ఆc. తెల్సింది. అరవక్కర్లేదు. ఇలా కూర్చొని మీ ఉపన్యాసం చెప్పవొచ్చు."

ఆ కుర్చీ మీద కూర్చున్నాను. స్థావరం చిక్కనే చిక్కింది! అన్నాను– "మీరు పొరబడుతున్నారు. సంసార స్త్రీలను ఇలా అవమానించటంలో మీ ఉద్దేశ్యమేమిటి?"

"నేనెవర్ని అవమానించాను?"

"యీ ఉత్తరం రాశారే..."

"అదా? అది మీకు రాయలేదు."

"మా వొదినకు రాశారు––"

"ఆ సంగతి మీకు అనవసరం. ఇంకోళ్ళ ఉత్తరాలు చూడటం హీనత్వాన్ని నిరూపించదనుకుంటాను."

ఆ మాటలు నాకు అర్థమైనా లెక్కచేయలేదు. "నా విధి నేను నిర్వర్తిస్తున్నాను. ఇది మంచిపని కాదని చెప్పేందుకు నేనేమీ భయపడను" అన్నాను.

"మీరు పొరపడుతున్నారు"

ఔను. నాకు మతిపోయింది. ఇప్పుడు నలుగుర్నీ పిలుస్తే వారేం అభిప్రాయమిస్తారో చూడాలనివుందా యేం?

నాకు తత్తర పుట్టింది. కొంపదీసి ఎవర్నీ పిలవడు కదా! ఆమె గొంతు తడి ఆరింది.

సౌమ్యంగా అన్నాను: "నిజం చెపుతున్నాను. నేను యీ విషయాల్ని మీకు అర్థమయేట్టు చేసి మా కుంటుంబ గౌరవాన్ని కాపాడమని చెప్పేందుకే వచ్చాను."

"అంతకన్న ఏమంటావు? ఎంత అందంగా తయారైనావ్! యీ మధ్య నీ వంక చూడటంలేదనుకున్నావ్ కాదూ? మనిషికి మారుగా మనిషి! ఐనా ఫర్వాలేదు. ఎందుకూ – వెన్నెలంతా వృథా అవటంలా? పైకి వెళ్దామా?"

నాకెంతో రోషం వొచ్చింది. నేనేదో ఇరకాటాన పడ్డాను కనుక నా భావాల్ని అతను గ్రహించటంలేదు.

"మీకు మళ్ళీ చెపుతున్నాను" అంతకుమించి నన్నేమీ చెప్పనీయకుండానే బరబరా మెట్ల మీదికి లాక్కువెళ్ళాడు.

పైకి వెళ్ళాక "చూడండి! నేను అలాటిదాన్ని కాదు. మీరు రాసిన ఉత్తరం నా దగ్గర వుంది. ఎవరికైనా చూపితే...?" అని బెదిరించాను.

"రేపు ఉదయం చూపుదువుగాని–" అని నన్ను దగ్గరకు లాక్కుంటూ "వొట్టి అల్లరి మేళాం నీది. సరిగ్గా ప్రతి విషయాన్ని గ్రహించగలనని అనుకుంటావ్. అంతేనా?" అన్నాడు.

నాకు కోపం మండిపోతోంది. కాని ఏమనేందుకూ వీల్లేని ఘట్టమైంది.

"నువ్వు స్వప్న సుందరివే!... మీ వొదినకు ఉత్తరం రాశానని కోపం నీకు! కాని అది నీకే రాశానంటే ఏమంటావ్?"

"మీరు ఏమైనా అంటారు--మొగాళ్ళు!"

"నిజం....చూడు: ప్రణయానికి అడ్డుతోవ యీర్ష్య అని తెలియదూ? నిన్ను నిన్నుగానే కోరటంకన్న మీ వొదిన మీద ప్రణయం చూపితే నీలో కలిగిన భావాలే నిన్ను చప్పున లాక్కు వచ్చినయ్. అర్థమైందా?.. మీ వొదిన వొట్టి పిచ్చిది. ఆమెకేం తెలుసు - నువ్వింత జాణవని?"

"మీకు తెలుసుగా?"

"తెలుసు...నీకూ తెలుస్తుంది. కాని యీ తెలుసుకున్నది మీ వొదినకు, మరెవ్వరికీ తెలియకూడదు. తెలిసిందా?"

ఆ తెలుసుకున్న సంగతుల్ని జీవితంలో మరువను. నేను అనుకున్నట్టే జరిగివుంటే అది ఎంత బాధాకరంగా మారేదో కూడా యీ తెలుసుకున్న దాన్ని పోల్చిచూసుకుంటే తేలిగ్గా అర్థమైంది!

నేను వెళ్ళేప్పుడు సుందర్రావ్ అన్నాడు.

"నీకు గర్వం. ఎంతో అందమైనదానివని! అందరూ నీ వెంట పడతారని! కాని నిన్ను తృణీకరించినట్టు నటించటంవల్లనే తలక్రిందులయావు. నీకన్న తక్కువ అందగత్తెను వెంటాడి నీలోని అగ్నిపర్వతాన్ని తేలిగ్గా రగుల్కొల్పాను తెలిసిందా?"

తెలిసిందనే ధైర్యం నాకు రాలేదు. ఇప్పటికి తెలుసుకున్నది, తెలుసుకోవాల్సిన దాంట్లో ఒక భాగమేనని తేలిపోయింది.

"తెలియలేదు" అన్నాను.

"ఐతే రేపు రాత్రికి--"

తెల్లారిపోతూన్నందుకు విచారిస్తూనే ఇంటి మొహం పట్టాను.

*- జూలై, 1950*